

మహిళలకు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు తెలియజేయాలి



అధికారులతో మాట్లాడుతున్న రఘువరణ్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సెర్ప్ సంఘాల ఆధ్వర్యంలో మహిళాల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు ఈవోపీఆర్డీ రఘువరన్ ఆదేశించారు. గురువారం మండలం ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఆర్థిక సాంకేతిక సహకారం అందించడానికి మహిళల ఎంపిక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాలను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీఆర్‌పీల ఎంపిక కోసం రాత పరీక్షతో పాటు, గ్రూప్ యాక్టివిటీ గురించి చర్చించి ఎంపిక చేశామన్నారు. సెర్ప్, ఎన్ఆర్‌ఎల్ఎం సంయుక్తంగా బ్లాక్‌లో ఉన్న మహిళ సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన మైక్రో ఎంటర్‌ప్రైజెస్, వాటి అభివృద్ధి గురించి ప్రచారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్, అడిషనల్ డీఆర్డీవో చరణ్‌దాస్, డీపీఎం వనజ, బ్లాక్ ప్రాజెక్ట్ మేనేజర్ చక్రవర్తి, ఏపీఎంలు శంకర్, విమోచన, సీసీలు వెంకటరమణ, శ్రీని వాస్, సూరయ్య, పురుషోత్తం, మహిళ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం @47,787



జిల్లాలో వివిధ కార్పొరేషన్లలో లక్ష్యాలు...దరఖాస్తులు

కార్పొరేషన్ పేరు	యూనిట్ల లక్ష్యం	వచ్చిన దరఖాస్తులు
ఎస్‌సీ	4,402	11,300
ఎస్‌టీ	674	1,437
మైనారిటీ	764	3,922
బీసీ	ఇంకా నిర్ణయించలేదు	31,128
మొత్తం (బీసీ మినహా)	5,840	47,787



ఆన్‌లైన్ సెంటర్‌లో లబ్ధిదారులు(ఫైల్)

- ఆన్‌లైన్‌లో భారీగా దరఖాస్తులు
- అదృష్టం వరించేదెవరినో?
- ఆయా శాఖలకు లక్ష్యాల కేటాయింపు
- బీసీ కార్పొరేషన్‌కు ఇంకా నిర్ణయించని లక్ష్యం
- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- ఆర్థిక సాయంపై నిరుద్యోగుల్లో ఆశలు

జగిత్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధికోసం రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో భారీ స్పందన వచ్చింది. నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. పలుమార్లు సర్వర్ సమస్యలు తలెత్తినా ప్రజాపాలన కేంద్రాలు, మీసేవా కేంద్రాల వద్ద క్యూలైన్ కట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకం ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు సబ్సిడీపై రుణాలు అందించనుంది. మొదట ఈ నెల5 వరకు గడువు నిర్ణయించారు. సర్వర్ సమస్యలు, దరఖాస్తు దారులు కుల, ఆదాయ ఇతర ధ్రువీకరణ పత్రాలు పొందడంలో తీవ్ర జాప్యం జరగడం.. అలాగే ఏ యూనిట్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎంత మొత్తం రుణం మంజూరు చేస్తారో నిర్ణయం కాకపోవడంతో చాలామంది దరఖాస్తు చేసుకునేందుకు వెనుకడుగు వేశారు. ఆ తర్వాత ప్రభుత్వం గడువును ఈనెల 14 వరకు పొడగించింది. గడువు ముగిసే వరకు జిల్లాలో 47,787 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

● అదృష్టం ఎవరికో..

రాజీవ్ యువ వికాసం పథకానికి భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యువతతో పాటు పలువురు రైతులు మండల కేంద్రాలతో పాటు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవాకేంద్రాల్లో కూడా దరఖాస్తులు సమర్పించారు. ఇటీవల వరుసగా సెలవులు వచ్చినా ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఈ కేంద్రాలను తెరిచి ఉంచారు. మున్సిపల్, మండల కమిటీలు దరఖాస్తులను పరిశీలించి ...

మిగతా 8లో

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

- కలెక్టర్ సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వ శ్రీకారం చుట్టిందని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతిపై రైతులకు గురువారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు భూ సంబంధిత విషయాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం భూభారతిని తీసుకువచ్చిందన్నారు. నూతన చట్టాంపై రైతులకు వివరించారు. నూతన ఆర్‌వోఆర్ తప్పుల సవరణ తదితర అంశాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, మార్కెట్ కమిటి చైర్మన్ బొరిగం రాజు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారం (ఆంధ్రజ్యోతి): రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి చట్టమని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం బుగ్గారం మండలంలోని రైతు వేదికల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం)2025పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా దొరుకుతుందని వివరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఎండీ మజీద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ బాపురెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్ , రైతులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు సహకార సంఘాల కృషి

- జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్

రాయికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. రాయికల్ ప్రామిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘాలు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సహకార ఆడిట్ అధికారి సత్యానారాయణ, సహకార శాఖ నోడల్ అధికారి సాయి కుమార్ గౌడ్, సంఘం ఉపాధ్యక్షుడు బేతి మోహన్ రెడ్డి, సంఘం డైరెక్టర్‌లు కుర్మ రాము, కైరం రమణ, కోల్ల నారాయణ, బోడ భూమరాజం, ఇన్‌చార్జి సీఈవో కటుకం జగదీశ్, సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే 'డబుల్' ఇళ్లు ఆలస్యం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేయడంలో జాప్యం వల్లె నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని లింగంపేటలో నిర్మించిన బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. జగిత్యాల పట్టణం మెడికల్ హబ్‌గా మారిందని మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుతో ప్రజలకు సౌకర్యవంతమైన వైద్యం అందించే వీలుందన్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వ బకాయి బిల్లులను ఇప్పటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు భారతి, చుక్క నవీన్, మల్లవ్వ, నాయకులు తురగ రాజిరెడ్డి, నర్సయ్య, కొక్కుల రమేష్ పాల్గొన్నారు.



బస్తీ దవాఖాన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

● అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

జగిత్యాల నియోజకవర్గంలో జరుతున్న పలు అభివద్ధి పనులపై పంచాయతీరాజ్, వెటర్నరీ, ఆరోగ్య శాఖ అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మంజూరైన బస్తీ, పల్లె దవాఖాన పూర్తి, పురోగతిపై చర్చించారు. నియోజక వర్గంలో మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనుల విషయమై ఎమ్మెల్యే అధికారులను ఆరా తీశారు. రాయికల్, వెల్దుర్తి, తుంగూర్, రేచపెల్లి గ్రామాల్లో పశు దవాఖాన నూతన, అదనపు పనుల విషయమై ఆరా తీశారు. పట్టణంలోని టీఆర్ నగర్‌లో నిర్మిస్తున్న బాల సదన్ నిర్మాణ పనుల పురోగతి, అదనంగా ఉన్న 75 లక్షల నిధుల వినియోగం, నియోజకవర్గానికి మంజూరైన సీఆర్ఆర్ నిధులు 30 కోట్ల టెండర్ ప్రక్రియపై, జగిత్యాల మున్సిపల్‌లో ఉన్న ఐదు కోట్ల నిధులతో చేయాల్సిన పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ఈఈ లక్ష్మణ్‌రావు, డీడబ్ల్యూవో నరేష్, మున్సిపల్ కమిషనర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

పెగడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర రాములుగౌడ్, ఒరుగల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనడంతో పాటు పెగడపల్లి, నందగిరి, రాజారాంపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ

పెగడపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 23 గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ సభ్యులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తీసుకోవాల్సిన విధివిధానాలను వివరించారు. సమావేశంలో తహసీల్దార్ బి రవీందర్, ఎంపీవో మహేందర్, పంచాయతీరాజ్ ఏఈ శంషేర్అలీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాలలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. మండలంలోని మల్యాల, ముత్యంపేట, నూకపల్లి, రామన్నపేట గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రైతులు సాగునీరు, కొనుగోలు సమయంలో అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రైతుల పక్షపాతిగా పంట కోతలకు వచ్చే చివరిరోజు వరకు సాగునీరు అందించిందని, సజావుగా కొనుగోళ్లకు పూనుకుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, వైస్‌చైర్మన్ జీవన్‌రెడ్డి, విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, మధుసూదన్ రావు, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, ఏపీఎం జీసీ రాజయ్య, ఎంపీవో ప్రవీణ్, ఏఎంసీ కార్యదర్శి వరలక్ష్మి నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శనిగారపు తిరుపతి, నేరెళ్ల సతీశ్‌రెడ్డి, సంత ప్రకాశ్‌రెడ్డి, బట్టు విజయ్, ప్రతాప్, కట్కం వినయ్, లక్ష్మణాచారి, జలందర్, హరినాథ్, నరసింహారెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

తరుగులేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

కొడిమ్యాల (ఆంధ్రజ్యోతి): రైతుల పండించిన ధాన్యాన్ని ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంతో పాటుగా రామకిష్టాపూర్, చెప్యాల, నాచుపల్లి, పూడూర్ గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలోని తిర్మాలాపూర్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జీవన్ రెడ్డి, సీనియర్ నాయకుడు మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు. మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, ఎంపీడీవో స్వరూప, ఏవో జ్యోతి, ఇన్‌చార్జ్ ఏపీఎం పద్మ, ఆర్ఐ కరుణాకర్, కొడిమ్యాల, పూడూర్ సింగిల్‌విండోల చైర్మనులు రాజనర్సింగరావు, రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండోల ఉపాధ్యక్షులు కవితచంద్రమోహన్‌రెడ్డి, రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, అయిలయ్య, మల్లేశంయాదవ్, సింగిల్ విండోల కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే రైస్‌మిల్లులకు తరలించాలి



పొలాసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, గుల్లపేట, తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అవసరమైన ప్యాడీ క్లీనర్లు ఏర్పాటు చేయాలన్నారు. తేమశాతం ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ రఘువరణ్, రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, నాయబ్ తహసీల్దార్ కార్తీకరెడ్డి, ఏపీఎం ఓదెల గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, సివిల్ సప్లై అధికారులు రాజేంద్రప్రసాద్, వరప్రసాద్ సీసీలు రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

రాయికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట, ఒడ్డెలింగాపూర్ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, మండల, పట్టణ కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి పాల్గొని ఈ నెల 27న వరంగల్‌లో కేసీఆర్ తలపెట్టిన రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, ఒడ్డెలింగాపూర్ గ్రామ అధ్యక్షుడు గుర్రం నర్సయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మాద రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన యాదగిరి బాబు

- జగిత్యాల అగ్రికల్చర్



బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న యాదగిరిబాబు

8

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య: డీఈవో

వెల్గటూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి రాము పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మండలంలోని పాషిగామ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సుశిక్షితులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నడుస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలల్లో చేర్పించాలని కోరారు. సమాజ భాగస్వామ్యంతో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్‌కుమార్, ఉపాధ్యాయుడు మహేష్‌ను అభినందించారు. విద్యార్థులకు తతరగతుల వారీగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సంధుపట్ల మహేష్ చేసిన మిమిక్రీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో ప్రభాకర్, ఎంపీవో శ్రీనివాస్, ఎండపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





పాషిగామలో మాట్లాడుతున్న డీఈవో రాము, నృత్యం చేస్తున్న ప్రాథమిక పాఠశాల చిన్నారులు

డంపింగ్ యార్డు పరిశీలన

కోరుట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్లూర్ కల్లూర్ రోడ్డులో డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ గురువారం పరిశీలించారు. డంపింగ్ యార్డులోని బయో మైనింగ్, డ్రై రిసోర్స్ కలెక్షన్ కేంద్రంను పరిశీలించారు. కార్యక్రమలో సానిటరి ఇన్‌స్పెక్టర్ ఆశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, బయోమైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని వివిధ ప్లాసిట్ దుకాణాలు, హోటల్స్‌లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్ దాడులు నిర్వహించి ప్లాస్టిక్ వాడుతున్న వారికి జరిమానాలను విధించారు.

ఘర్షణకు దారితీసిన క్రికెట్ ఆట

● మాజీ కౌన్సిలర్‌తోపాటు కుమారుడిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆట రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో ఇటీవల సెలవులు రావడంతో బాలలంతా కలిసి క్రికెట్ ఆడేందుకు క్రీడామైదానానికి వెళ్లారు. ఇందులో భాగంగా ఇరుజట్లు మైదానంలోకి క్రికెట్ ఆడేందుకు దిగాయి. ఇరువైపుల జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో భవన్ అనే బాలుడు రెండుసార్లు అవుట్ అయ్యాడు. దీంతో నన్నే అవుట్‌చేస్తావా, మా నాన్న రెండుసార్లు కౌన్సిలర్.. అంటూ ఆగ్రహంతో క్యాచ్‌పట్టిన భార్గవ్ అనే బాలుడిని బ్యాట్‌తో కొట్టాడు. దీంతో రెండు కుటుంబాల మధ్య వివాదానికి తెరలేపింది. క్రికెట్‌లో అవుట్ చేసిన బాలుడిపై దాడిచేయడంతో అతని స్నేహితులు వెంటనే అతని ఇంటికి వెళ్లి తల్లికి చెప్పారు. ఎందుకు కొట్టావంటూ బాలుడిని అడిగేందుకు వెళ్లిన తల్లిపై మాజీకౌన్సిలర్ దౌర్జన్యం చేయడమే కాకుండా దుర్భాషలా డారు. దీంతో బాధితురాలు అన్నల్‌దాస్ ఉష పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. ఈమేరకు మాజీకౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, అతడి కుమారుడు భవన్‌పై అదేరోజు కేసు నమోదుచేశామని టౌన్ సీఐ కె కృష్ణ గురువారం తెలిపారు. ఇదిలా ఉంటే తమకు మాజీకౌన్సిలర్, అతని అనుచరులతో ప్రాణభయం ఉందని, ద్విచక్రవాహనాలతో తమ ఇంటిచుట్టూ చక్కర్లు కొడుతూ భయభ్రాంతులకు గురిచేస్తు న్నారని, తమకు రక్షణ కల్పించాలని బాలుడితల్లి ఉష వేడుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ

మల్యాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై మండలంలోని ముత్యంపేటలో డీఎస్పీ రఘుచందర్ విచారణ జరిపారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన తిప్పని కార్తిక్ అనే యువకుడు ముత్యంపేటకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తూ మంగళవారం యువతి ఇంటికి వచ్చి కులం పేరుతో దూషించాడు. దీంతో పోలీసులు బుధవారం యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. గురువారం డీఎస్పీ విచారణ జరిపి వివరాలు నమోదు చేసుకున్నారు. డీఎస్పీ వెంట ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

భక్తులతో అమర్యాదగా ప్రవర్తించడం సరికాదు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకున్న కార్యదర్శి సిరిమల్ల జయేందర్ భక్తులు, గురుస్వాములపట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదని భక్తులు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. లక్షలాది రూపాయలు చందాలు ఇచ్చిన భక్తులకు ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఆహ్వానించకపోవడం బాధాకరం అన్నారు. ప్రశ్నించిన వారిని ఏదో విధంగా అవమానపరుస్తూ ఆలయానికి రాకుండా చేస్తున్నారని అయిత విజయ్‌కుమార్, గందె రాజు, యాద సతీష్, తదితరులు తెలిపారు.

వృద్ధులకు అండగా..

లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఉచిత సేవలు

అవగాహన కల్పించి కంటి చికిత్సలు

10374 మందికి ఆపరేషన్లు, 63743 మందికి అద్దాలు



కంటి ఆపరేషన్‌కు వెళ్తున్న బాధితులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు లోపంతో కొట్టుమిట్టాడుతున్న వృద్ధులకు మేమున్నామని అండగా నిలుస్తోంది లయన్స్ క్లబ్ విజన్ కేర్. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా కు చెందిన 23 మంది నేత్రవైద్య సహాయకులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మొదటి విడుతలో తెలంగాణ కంటి వెలుగులో పని చేశారు. కంటి వెలుగు పథకం లేకపోవడంతో బాధితుల నుంచి నేత్ర వైద్య సహాయకులకు పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. వీరికి కంటి చూపు కల్పించాలన్న భావన వారిలో వ్యక్తమైంది. నేత్ర వైద్య సహాయకులు వారిలో కంటిలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జీ వారిని సంప్రదించి పరిస్థితిని వివరించారు. వారు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

2021లో పూదరి దత్తాగౌడ్ నేతృత్వంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ స్థాపించారు.



వ్యవస్థాపక అధ్యక్షుడిగా దత్తాగౌడ్ లాభాపేక్ష లేకుండా అడుగులు ముందుకు వేశారు. వచ్చిన వినతులను పరిశీలించి ఆయా గ్రామాలకు వెళ్ళి కంటి చికిత్సలు చేయించడం మొదలుపెట్టారు. లయన్స్ క్లబ్ సభ్యులు గ్రామాల్లో తిరుగుతూ కంటి చికిత్సలపై విస్తృత స్థాయిలో అవగా హన కల్పించి చికిత్సలు చేయించుకు నేందుకు ప్రోత్స హించారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో ఉచితవైద్య శిబిరాలు నిర్వహించారు. ఇప్పటి వరకు 2లక్షల13 వేల 567 మందికి పరీక్షలు చేయించారు.

సుమారు 10 వేల 374 మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. అద్దాలు, మందులు అందేలా చర్యలు తీసుకున్నారు. కంటి శస్త్ర చికిత్స అందించే వారితో పాటు వచ్చే సహా యకులకు ఉచిత రవాణా, భోజన వస తులు కల్పించారు. లయన్స్ కంటి ఆసుపత్రి రేకుర్తి, చల్మెడ ఆనంద రావు ఆసుపత్రి, బెల్లం పల్లి పుష్పగిరి కంటి ఆసుపత్రిల సహకా రంతో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిం చారు. ఈ ఆపరేషన్లకు డిస్ట్రిక్స్ బ్లైండ్నెస్ కంట్రోల్ సొసైటీ ద్వారా ఒక్కో ఆపరేషన్‌కు 2 వేల రూపాయలు చెల్లిస్తోంది. ఈ డబ్బులు రవాణా, భోజన సౌకర్యాల ఖర్చులకు సరిపో తుంది. ఒక్క ఆపరేషన్ బయట చేయించుకోవాలంటే సుమారు 20 వేల రూపాయలు ఖర్చు అవుతుందని వారు పేర్కొంటున్నారు. దాతల సహకారంతో 63 వేల 743 మందికి అద్దాలు అందజేశారు. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి అవుట్ సోర్సింగ్ లేదా రెగ్యులర్ అసిస్టెంట్ అప్తామాలిక్ పోస్టులుగా గుర్తించి ఉపాధి కల్పిస్తే మరింత సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొంటున్నారు.

లయన్ సభ్యులు పూదరి దత్తాగౌడ్, అలీ అహ్మద్, పెర్క పృథ్వి రాజ్, సయ్యద్ ఇలియాస్ పరకాల, దామ లావణ్య, ముబీన్, బొగే సాయి నిఖిల్, అబ్దుల్ వాసే, బోడ రమేష్, షాకీర్, ఆసిమ్, బుద్దార్తి సతీష్ కుమార్, ఆకుల మల్లేష్, మాదర్‌ఖాన్, అలీం లయన్స్ క్లబ్ విజన్ సెంటర్ల ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి దాతల సహాయంతో ఆపరేషన్లు చేస్తూ అద్దాలు, మందులు అందజేస్తున్నారు.

పేద ప్రజలకు కంటివైద్యం అందించడమే లక్ష్యం
పూదరిదత్తాగౌడ్, లయన్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు



నిరుపేద ప్రజలకు కంటి వైద్యం అందించడమే లక్ష్యంగా లయన్ విజన్ కేర్ పని చేస్తుంది. ఇప్పటికి వరకు లక్షలాది మందికి పరీక్షలు చేసి వేల మందికి ఆపరేషన్లు చేసి అద్దాలు అందజేశాం.

5వేలకు పైగా ఆపరేషన్లు
చిదుర రమేష్, రేకుర్తి కంటి ఆస్పత్రి వైస్ చైర్మెన్



రేకుర్తి ఆస్పత్రిలో లయన్ విజన్ కేర్ ద్వారా 5 వేల మందికి పైగా ఆపరేషన్లు చేశాం. ప్రభుత్వం రోగు లకు ఇస్తున్న రెండువేల రూపా యలతో రవాణా, భోజన సౌకర్యం కల్పించాం. నెల రోజులకు సరిపడా మందులు అందజేశాం.

పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు
భూదమ్మ మంథని



పైసా ఖర్చు లేకుండా బస్సులో తీసుకెళ్ళి పరీక్షలు చేసి ఆపరేషన్ చేసి అద్దాలు, మందులు ఇచ్చారు. ఇప్పుడు కండ్లు మస్క లేకుండా కనిపిస్తున్నాయి,

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

● 23 మందికి గాయాలు
● డ్రైవర్ ఫోన్ మాట్లాడమే ప్రమాదానికి కారణం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం అప్పన్నపేట, అందుగులపల్లి మధ్య కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న లారీని గురువారం సాయంత్రం ఢీకొంది. పెద్దపల్లి మండలం అప్పన్నపేట అందుగులపల్లి మధ్యలో రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌ను వన్‌వేకు మళ్లించారు. కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న పల్లె వెలుగు టీఎస్ 02 యూబీ 9326, కరీంనగర్ వైపు వెళ్తున్న బూడిద లారీ టీఎస్ 22 0450 ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సులో సుమారు 32మంది ప్రయాణికులున్నారు. ఈ సంఘటనలో 27మందికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కండక్టర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రి తరలించినట్లు తెలిసింది. అయితే డ్రైవర్‌నాగేందర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడపడం వల్లే ఈప్రమాదం జరిగిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆస్పత్రిఆవరణ క్షతగాత్రులతో నిండిపోయింది. గాయాలైన వారిలో ఎర్రగొండ పావని, కీర్తన, ఎర్రగొండ ప్రేమలత, కోంద్రరాధ, అగపెలిసా, చిరంజీవి, ఎనవాక మహాలక్ష్మీ, తన్విశ్రీ, మోక్షశ్రీ, శారద, సహస్ర, కొయ్యడ సంపత్, కొయ్యడ రజిత, కీర్తన, సౌజన్య, శోభ, వొల్లెపురాజమ్మ, అనిల్‌కుమార్, కాంపెల్లి సుజాత, మడుపు అనిత, సరిత, మోక్షిత్, వైష్ణవి, దీపిక, మనోజ్, ఎరుకల శోభ,ఆశానె,సృజన ఉన్నారు.ప్రమాదం జరిగినవెంటనే ఏసీపీ గజ్జికృష్ణ, ఎస్సైలు సీఐ, సిబ్బందిని పంపించి సహాయక చర్యలు చేపట్టారు.


ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, లారీ


గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

● క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

గాయపడిన వారిని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. గాయ పడిన వారికి వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆర్ఎం భూపతిరెడ్డి, గోదా వరిఖని డీఎం నాగభూషణం పరామర్శించారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య


శ్యామల (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన మార శ్యామల(38) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గంగిపల్లికి చెందిన యాదగిరితో 26ఏళ్ళ క్రితం శ్యామల వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె జన్మించగా కుమార్తెకు ఇటీవల అప్పుచేసి వివాహం జరిపించారు. తన భర్త యాదగిరి దుబాయి వెళ్లగా కొంతకాలంగా శ్యామల అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులలో చూపించిన నయం కాలేదు. జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం రాత్రి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న భర్త యాదగిరి గురువారం స్వగ్రామానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవపంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోరుట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన నీరేటి ముత్తయ్య (60) అనే వ్యక్తి మృతి చెందాడు. ముత్తన్న కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి డయాలసిస్ చేసుకోవడానికి గురువారం మధ్యాహ్నం వచ్చాడు. చికిత్స నిర్వహిస్తున్న సమయంలో ముత్తయ్య మృతి చెందాడు. ముత్తన్న మృతికి వైద్యులు కారణమంటూ మృతుడి బంధువులు నిలదీసారు. ముత్తన్న మృతిపై అనుమానం ఉందని ఆందోళనచేసేందుకు సిద్దంమయ్యారు. గమనించిన స్థానికులు కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంకు చేరుకోన్న ఎస్ఐ శ్రీకాంత్ ముత్తన్న కుటుంబసభ్యులు, బంధువులను సముదాయించారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించి రిపోర్ట్ ఆదారంగా ఆసుపత్రి వర్గాలపై కేసునమోదు చేస్తామని తెలిపారు. కాగా ముత్తయ్య కుస్తాపూర్ గ్రామం నుంచి మధ్యాహం ద్విచక్ర వాహనంపై ఎండలో వచ్చాడని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ముత్తయ్య ఎండ వేడికి మృతి చెందాడో... లేక మరే ఇతర కారణంతో మృతి చెందాడన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్స్


జమ్మికుంటకు వెళ్లే మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోని రెండు మూలమలుపులు, రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదం పొంచి ఉంది. తూర్పుదర్వాజ బస్టాండ్ మూలమలుపు వద్ద 20ఏళ్ల క్రితం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధానరహదారి మానకొండూర్ తూర్పుదర్వాజ బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు నిత్యం వెళుతుంటాయి. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు తిరిగే మూలమలుపు వద్ద గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డ్రైవర్ ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనాల్సిందే. జమ్మికుంట వైపు వెళ్లే ప్రయాణికులు నిలబడడానికి అక్కడ స్థలమే లేదు. ప్రయాణికులు వేరే స్థలంలో ఉండి బస్సు వచ్చే సమయంలో పరుగులు తీసి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడ అనేకప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం ఇదే బస్టాండ్‌వద్ద జమ్మికుంట నుంచి కరీంనగర్ వెళ్లే మూలమలుపు వద్ద విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు గద్దెను నిర్మిస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు, ప్రయాణికులు వ్యతిరేకిస్తున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై మానకొండూర్ విద్యుత్ ఏఈ ఆర్ సత్యనారాయణను వివరణ కోరగా పాతట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు పడుతోందని స్థలం లేకపోవడంతోనే మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు



వెంకటాపూర్ వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో పోలీసులు అక్రమ అరెస్ట్ చేసిన నాయకులకు సంఘీభావం తెలపడం కోసం వెళుతున్న ఎల్లారెడ్డిపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలను మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గురువారం పోలీసులు అడ్డుకున్నారు. గంభీరావుపేటలో నెలకొన్న ప్రోటోకాల్ వివాదంలో బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని పేర్కొంటూ అక్కడి పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారనే సమాచారంతో బయలుదేరి వెళ్లారు. దాంతో వెంకటాపూర్ గ్రామ శివారులో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తమ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరితే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని నాయకులు కృష్ణహరి, కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఫ్లెక్సీ వివాదం

● ప్రారంభోత్సవ సమయంలో తోపులాట ● పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

గంభీరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రంవద్ద ఫ్లెక్సీవిషయమై వివాదం నెలకొంది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు మార్కెట్‌కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతితోపాటు పలువురు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్ ఫొటోలు లేవని నిర్వాహకులను ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మధ్య వాదోపవా దాలు పెరిగి, తోపులాటకు దారితీసింది. స్థానిక ఎస్ఐ ప్రేమానందం, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీస్‌సిబ్బంది జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉండగా తమ పార్టీ నాయ కులపై కాంగ్రెస్ నాయకులు దాడిచేశారని సిరిసిల్ల నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్యనేతలు గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. తమనాయకులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రం ప్రారంభాన్ని అడ్డుకుని, విధులకు ఆటంకం కలిగించారంటూ బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు సైతం ఫిర్యాదు చేశారు. రెండు పార్టీలనేతలు ఒకరిపై ఒకరు విమర్శిస్తూ పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తతగా మారింది.


కొనుగోలు కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

గంజాయి పట్టివేత

గంగాధరర,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లో గురువారం 68గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ వంశీక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గట్టుబూత్కూర్ గ్రామశివారు రైసుమిల్లులో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ముకేష్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు ఆయన తెలిపారు. 68గ్రామాలు గంజాయితో పట్టుబడిన ముకేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఓనర్ ఈరవేణి శ్రీనివాస్, పూసల శంకర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రైలు కింద పడి ఒకరి బలవన్మరణం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని రైలుకింద పడి ఓ వృద్ధుడు గురువారం ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్ల వాడకు చెందిన పొట్టబత్తిని సురేందర్(69) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

నిజాం దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన 'సింగిరెడ్డి' కుటుంబం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం నిలిచిందని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు సింగిరెడ్డి భూపతిరెడ్డి కుమార్తె బద్దం సత్తవ్వ పది రోజుల క్రితం మృతిచెందగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను చాడ వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు పరామర్శించారు. బద్దం సత్తవ్వ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అన్నబేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డిలు సాయుధ దళాల నిర్మాణంచేపట్టి నైజాం, జమిందారులు, భూస్వాము లకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటం దిక్కు నడిపించారని గుర్తుచేశారు. ఆ పోరాటానికి సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం మొత్తం ఉద్యమానికి మద్ద తును తెలియజేస్తూ నిజాం పోలీసుల దాడులను నిత్యం ఎదుర్కొంటూ ఇంటికి వచ్చిన దళాలు, దళనాయకులకు సహాయసహకారాలు అందించి ఉద్యమాన్ని కాపాడారన్నారు. పోలీసులు, నైజాంసర్కార్ దాడులకు వ్యతిరేకంగా నిలబడి చివరి వరకు ఎర్రజెండా పోరాటస్మృతులను, సింగిరెడ్డి భూపతిరెడ్డిచేసిన త్యాగాలను స్మరించుకుంటూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా బద్దం సత్తవ్వ ముందుకు సాగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి గుంటివేణు, జిల్లా కార్యవర్గసభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, కడారి రాములు, అజ్జువేణు, సోమనాగ రాజు, మంత్రి చంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్రరాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, నాయకులు

రెండు ఇళ్లలో చోరీ


విచారణ చేపట్టిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులకథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్రం రాజవ్వ, వెంగళ వినోద ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. చిర్రం రాజవ్వ ఇంటికి తాళంవేసి తన కుమారుడి ఇంటికి నిద్రిం చేందుకు వెళ్లింది. ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.15వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు తెలిపింది. ప్రశాంత్ అనే పాస్టర్ తన ఇంటిముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వినోద 25రోజులక్రితం హైదరాబాద్ వెళ్లి నందున వివరాలు తెలియవలసి ఉన్నది. ఈ సంఘటనపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య విచారణ చేపట్టారు.

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): భారతదేశం చారిత్రక, పౌరాణిక, ఇతిహాసిక, సాంస్కృతిక, నైతిక వారసత్వానికి వాసి గాంచిన నేల. దేశంలో ఎన్నో కట్టడాలు, చరిత్రలు, స్థలాలు, వస్తువులు మన దేశ, ప్రాంత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నాయి. ఒక్కో రాష్ట్రానికి, జిల్లాకు ప్రత్యేక చరిత్ర, సంస్కృతి, శిల్ప సంపద ఉండగా అవన్నీ మనల్ని మంత్రముగ్ధుల్ని చేసి మరపురాని మధుర జ్ఞాపకాలుగా నిలుపుతాయి. ప్రతీ యేటా ఏప్రిల్ 18న అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవంగా (ప్రపంచ వారసత్వ దినోత్సవం, వరల్డ్ హెరిటేజ్ డే) జరుపుకుంటారు. ఐక్య రాజ్య సమితిలోని సభ్య దేశాలు, అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో వారసత్వ సంపద పరిరక్షణకు ఒకరికొకరు పలు అంశాలతో పరస్పరం సహకరించుకోవాలని ఆఫ్రికాలోని ట్యూనీషియాలో 1982, ఏప్రిల్ 18న సమావేశంలో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రతిపాదనను యునెస్కోకు పంపగా ఏప్రిల్ 18ని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారసత్వ సంపద ప్రాధాన్యం తెలిపేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 800 పురాతన కట్టడాలు, స్థలాలను గుర్తించి పరిశీలన జరుపుతున్నారు.


ఎలగందుల ఖిల్లా

ఘనమైన వారసత్వ సంపద

- పట్టించుకోక శిథిలావస్థకు..
- దెబ్బతింటున్న పలు కట్టడాలు
- నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో పలు కట్టడాలు

ఉమ్మడి జిల్లాలో పురాతత్వ వారసత్వ కట్టడాలు సుమారు 150 వరకు ఉండగా అందులో పురాతత్వ శాఖ గుర్తించిన ప్రదేశాలు, కట్టడాలు 50 నుంచి 60 వరకు ఉన్నాయి. 1850 నుంచి 1950 వరకు వివిధ ప్రదేశాలు, గ్రామాల్లో కట్టిన 350 బురుజులు ఉన్నాయి. మౌర్యులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, వేములవాడ చాళుక్యులు, పొలవాస, విజయనగర రాజులు ఈ జిల్లా ప్రాంతానికి వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అనంతరం బహమనీయులు, మొఘలాయిలు, కుత్‌బు షాహీలు, అసబ్‌జాయిలు వంటి ముస్లిం రాజులు ఈ నేలపై కాలు మోపారు. విస్తారమైన గోదావరి, మానేరు వంటి నదీతీరాలు వెలియడంతో మన కట్టడాల చరిత్ర మరింత విలసిల్లింది. కోటలు, ఆలయాలు, మసీదులు, చర్చిలు, రాజులు, మంత్రులు, జమీందారుల స్థావరాలు ప్రాచీన చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ధూళికట్ట బౌద్ధ స్తూపం అమరావతి స్తూపం కంటే పురాతనమైనదిగా చెబుతారు. అది ప్రస్తుతం హీన దశకు చేరుకుంటోంది. జగిత్యాల, ఎలగందుల, మొలంగూరు లాంటి కోటలు శిథిలమవుతున్నాయి. ఐదు కోట్ల వ్యయంతో అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి, ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎలగందుల ఖిల్లాలో సౌండ్, లైటింగ్ షో ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు అనంతరం అది మూలన పడింది.


వేములవాడలోని భీమేశ్వరాలయంలోని జైన విగ్రహాలు

కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం


కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం 1975లో బయట పడగా గోదావరి నీరు ముంపునకు గురి కాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చారిత్రక నేపథ్యం ఉన్న పొలాస ఆలయాలు శిథిలమవుతున్నాయి. వేములవాడ భీమేశ్వర ఆలయంలో సప్తమాతృకలు, లింగాలు, జైన విగ్రహాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుమారు 1700 సంవత్సరాల కేదారీశ్వర ఆలయం, నగరేశ్వర దేవాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. కరీంనగర్ పాతబజార్ గౌరీశంకరాలయంలో రెండు జైన విగ్రహాలుండగా ఒకటి ధ్వంసం కాగా మరొకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. వేములవాడ చాళుక్యుల కాలం నాటి సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట సమీ పంలోపి మూలవాగు పుట్టిన భీముని మల్లారెడ్డిపేట సీతారామ, ఆంజనేయ స్వామి ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గోదావరి తీరంలోని మంథనిలో 25 ఆలయాలుండగా గౌతమేశ్వర స్వామి దేవాలయం కాకతీయుల కాలం నాటిది. నగునూరు, కొత్తపల్లి, బొమ్మలమ్మ గుట్ట దేవాలయాలు కూడా అభివృద్ధికి నోచుకోవాల్సిన అవసరం ఉంది. 1905లో ఎలందుల నుంచి కరీంనగర్‌కు జిల్లా తరలివచ్చిందని చెబుతారు. జిల్లా పర్యాటక అధికారిగా ఏడాదిగా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు


కరీంనగర్‌లోని మ్యూజియం

ఆదరణకు నోచుకోని కరీంనగర్ మ్యూజియం

కరీంనగర్‌లో అర్ధ శతాబ్దం క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పురావస్తుశాఖ మ్యూజియం ఆదరణకు నోచుకోవడం లేదు. పట్టించుకునే వారు లేక శిథిలా వస్థకు చేరుకుంది. గోడలకు రంధ్రాలు ఉండడంతో విలువైన విగ్రహాలు, ఇతర వస్తువులకు భద్రత కరువైంది. పురావస్తు శాఖలో నిధు లు, సిబ్బంది కొరతతో ఈ మ్యూజి యం, కార్యాలయాల నిర్వహణ భారంగా మారింది. మ్యూజియం లోని ప్రదర్శనశాలలో ఇత్తడి, ఆదిమ జాతుల కాలం నాటి పాతరాతి యుగం ఆనవాళ్ళు, ప్రముఖ చరిత్రకారుడు ఠాకూర్ రాజారాంసింగ్ భద్రాచలం నుంచి బాసర వరకు తిరిగి సేకరించిన ఆదిమ మానవులు వాడిన రాతి పని ముట్లు, రెండు వేల సంవత్సరాల చరిత్ర గల శాతవాహనుల కాలం నాటి కోటి లింగాల బౌద్ధ స్తూప ఖండికలు ఉన్నాయి.


జగిత్యాల కోట


మొలంగూర్ ఖిల్లా


ఎలగందుల ఖిల్లాలో మినార్‌లు

ఐఆర్‌సీటీసీ సమ్మర్ ప్యాకేజీ

- హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర
- జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్



పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర సమ్మర్ స్పెషల్ ప్యాకేజీ అందుబాటులో ఉన్నాయని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ ద్వారా ఐఆర్‌సీటీసీ భారత గౌరవ టూర్ పేరుతో ప్రత్యేకంగా దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను హైదరాబాద్ నుంచి ప్యాకేజీలు తయారు చేసిందని, వీటిలో ట్రైన్, బస్ జర్నీ, హోటల్, భోజన ఖర్చులు, గైడ్‌తో సహ సైట్ సీయింగ్ ఉంటాయని పేర్కొన్నారు. భార త గౌరవ టూర్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి ఐదు ప్యాకేజీలలో ప్రత్యేక రైళ్లు ఉన్నాయని తెలిపారు.

- ఈనెల 23 నుంచి మే 2 వరకు 9 రాత్రులు, 10 రోజులలో హరిద్వార్, రిషికేష్ వైష్ణవ దేవి, ఆనంద్‌పూర్, నైనాదేవి, అమృత్‌సర్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ప్రతీ ఒక్కరికి 18,150 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 8 నుంచి 17 వరకు 9 రాత్రులు, 10 రోజులలో వారణాసి, పూరి, గయా, అయోధ్య, ప్రయాగ్ రాజ్, కోణార్క్ పర్యాటక ప్రాంతాలను కవర్ కానుండగా, ఒక్కరికి 16,800 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 22 నుంచి 30 వరకు 8 రాత్రులు, 9 రోజులలో అరుణాచలం, రామేశ్వరం, తంజావూర్, కన్యాకుమారి, త్రివేండ్రం, త్రిచి, మధురై పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి రూ.14,700 ఖర్చు అవుతుంది.
- జూన్ 4 నుంచి 12 వరకు 8 రాత్రులు, 9 రోజులలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోహం, నాగ్‌పూర్ పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి 14,700 రూపాయల ఖర్చు అవుతుంది.

భారత గౌరవ టూర్‌లో పాల్గొనే వారు www.irctctourism.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సికింద్రాబాద్ రోడ్డులోని ఐఆర్‌సిటిసి, మూడవ ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, సికింద్రాబాద్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 04027702407, 9701360701, 9281495845, 9281495843, 9281030750, 9281030740 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేటి రంగనాయక స్వామి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈఓ శంకర్ ఆధ్వర్యంలో భక్తి గీతాలు, సంకీర్తనలు ఆలపించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సతీష్, పెద్దన్న శంకర్, అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్ కమారాచార్యులు, మాజీ సర్పంచ్ విజేందర్, పెరుమారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో షార్ట్ టర్మ్ బ్యూటీషియన్ కోర్సు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో షార్ట్ బ్యూటీషియన్ కోర్సు అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సుతో వచ్చే సర్టిఫికెట్ ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. 25 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



మహిళా హక్కుల పరిరక్షణ యాత్రలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, అంబేద్కర్, పూలే ఆశయాల సాధన దిశగా ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర గురువారం కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్ వద్ద ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. అంబేద్కర్, జ్యోతిబాపూలే ఆశయాల సాధన, మహిళా హక్కుల పరిరక్షణ కోసం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం కృషి చేస్తుందన్నారు. మహిళలపై ఆగాయిత్యాలు జరగకుండా చట్టాలు కఠినతరం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిరక్షణ యాత్రకు, రైతు సంఘం మాజీ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, రైతు సంఘం అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.తిరుపతి, నరేష్ పటేల్ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి, రాష్ట్ర సహా య కార్యదర్శి కేఎన్ ఆశలత, నల్లిగంటి రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు

- భీమన్న ఆలయంలో భక్తులకు దర్శనం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు జూన్ మాసంలో ప్రారంభించనున్న సందర్భంగా భక్తులకు అనుబంధ ఆలయ మైన భీమేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్‌చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్ కుమార్‌లతో కలిసి గురువారం రాజన్న ఆలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయం ప్రాంగణం, ఆవరణ, ఆలయం ముందు భాగంతో పాటుగా శ్రీభీమేశ్వర స్వామివారి ఆలయాన్ని క్షేత్ర స్థాయిలో ఆలయ అభివృద్ధి నమూనాలతోపాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వేముల వాడ దేవాలయ అభివృద్ధికి రూ.38 కోట్లు ప్రకటించారన్నారు. ఆగమ శాస్త్రం, వాస్తు అంశాలను దృష్టిలో పెటుకుని భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని కార్యాచరణ రూ పొందిస్తున్నామన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఆది శ్రీనివాస్, శైలజరామయ్యార్

శృంగేరి పీఠం అనుమతితో పనులు ప్రారంభిస్తాం ● శైలజరామయ్యార్

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు, అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు, రోడ్డు వెడల్పు పనులకు రూ.47 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. దేవాలయ అభివృద్ధితో పాటుగా పట్టణ అభివృద్ధి సమాంతరంగా జరగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్న దాన సత్రం నిర్మాణ పనులకు టెండర్ పూర్తి చేశామని తెలిపారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతి, ఆశీర్వాదం తీసుకుని ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఆర్అండ్‌బీ సీఈ బిల్డింగ్స్ రాజేశ్వర్‌రెడ్డి, సీఈ ఎలక్ట్రికల్ లింగారెడ్డి, ఎస్ఈ లక్ష్మణ్, జిల్లా ఈఈ వెంకట రమ ణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వరశర్మ, శరత్‌శర్మ పాల్గొన్నారు.

రాజన్న సేవలో..

రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సందర్శనకు వచ్చిన దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్ చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలకు స్వాగతం పలికారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సమీక్ష

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధిపై దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వివిధ శాఖల అధికారులతో కలిసి ఆలయ గెస్ట్‌హౌస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అవసరమైన మార్గదర్శకాలు, అనుమతుల కోసం ఈ నెల 27వ తేదీన శృంగేరి పీఠం వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.76 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు భూసేకరణ పెండింగ్ లేదని, ఆలయ నిర్మాణ పనుల మానిటరింగ్ కమిటీని జూన్ నెలలో ఏర్పాటు చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ధార్మిక సలహాదారులు గోవిందహరి, స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్, ఈఈ రాజేష్, డీఈ రఘు నందన్, ఆర్‌అండ్‌బీ అధికారులు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మణ్, వెంకట రమణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ తదితరులు ఉన్నారు.


పొలం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

పంటచేనుపై మూడో కన్ను

- పొలం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసిన రైతు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దొంగలు పెట్రేగిపోతున్నారు. ఇళ్లు, ఆలయాలే కాకుండా వ్యవసాయ పొలాల వద్ద తమ చేతులకు పని చెబుతున్నారు. వ్యవసాయ సామగ్రిని కాపాడుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు గన్న బాల్‌రెడ్డి దుమాల గ్రామశివారులోని తనకున్న పొలం వద్ద రూ.5వేలు వెచ్చించి విద్యుత్ స్తంభానికి సీసీ కెమెరా బిగించాడు. వర్షానికి తడవకుండా ఉండడంతో పాటు ఎవరికీ అనుమానం కలగకుండా కరెంటు స్తంభంపై ఓ ఖాళీ డబ్బాను సగం వరకు తొలగించి అందులో సీసీ కెమెరా ఏర్పాటు చేశాడు. గతంలో పొలం వద్ద నుంచి ఎరువుల సంచులు, పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు రైతు బాల్‌రెడ్డి పేర్కొన్నాడు. సీసీ కెమెరాను బిగించడంతో చోరీలు తగ్గాయని చెబుతున్నాడు.

దాహం తీర్చని 'మిషన్ భగీరథ'

- గ్రామాల్లో పూర్తి కానీ పైప్ లైన్ పనులు
- పట్టించుకోని అధికారులు


జాగీర్‌పల్లిలో నీరు రాక నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా

సైదాపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి మంచి నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ప్రవేశ పెట్టింది. అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు ప్రజల దాహార్తిని తీర్చలేకపోతోంది. సైదాపూర్ మండలంలో ఏ గ్రామానికీ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వేసవి కాలం సమీపించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశముంది. మండలంలో ఏ గ్రామంలోనూ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో ఇంటింటికి పైపులు వేసి నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ ఆ పైప్‌లైన్ కు నీటి కనక్షన్ ఇవ్వలేదు. దీంతో ఇంటి ముందు పేరుకే మిషన్ భగీరథ నల్ల ఉంది కానీ నీరు రావడం లేదని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


వ్యవసాయ బావుల నుంచి నీటి సరఫరా

సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడం, చాలా రోజుల నుంచి వర్షాలు పడక పోవడం, ఎండలు ముదిరి ఉష్ణోగ్రతలు పెరగడంతో భుగర్భ జలాలు అడుగంటాయి. దీంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైంది. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఆయా గ్రామా పంచాయతీల ఆధ్వర్యంలో ప్రైవేట్ వ్యవసాయ బావుల నుంచి నీటిని కొనుగోలు చేసి గ్రామంలోకి సరఫరా చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసి ప్రతీ ఇంటికి నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు రావడం లేదు
రాధారపు పద్మ, జాగీర్‌పల్లి



మిషన్ భగీరథ నీళ్లు వస్తాయని ఇంటి ముందు నల్లా పెట్టి ఐదేళ్లు గడిచాయి. ఇప్పటి వరకు ఒక్క బొట్టు నీళ్లు రాలే దు. పెద్ద సార్లు మాకు మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా చూడాలి.


వృథాగా మిషన్ భగీరథ నల్లా పైపు

సర్వాయిపేటలో గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వ్యవసాయ బావి నుంచి నల్లాల బావికి పైపుల ద్వారా నింపుతున్న నీరు

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

● అనిత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నారా?

ప్రిన్సిపాల్: తాగునీరు, భవనాలు, మరుగుదొడ్లు వంటి వసతులు పూర్తిస్థాయిలో ఉన్నాయి. వంటగది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గది నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. సుమారు రూ. మూడు లక్షల వ్యయంతో అంచనాలు వేయడానికి సిద్ధం చేశాం.

ఆంధ్రజ్యోతి: ఆరో తరగతిలో ప్రవేశాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

ప్రిన్సిపాల్: ఆరో తరగతిలో 2025-26 సంవత్సరానికిగాను 100 సీట్లకు 146 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల చివరలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తాం. మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తాం. ప్రస్తుతం పాఠశాల, కళాశాలలో 746 మంది విద్య అభ్యసిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో హాస్టల్ వసతి ఉందా?

ప్రిన్సిపాల్: కేవలం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకే హాస్టల్ వసతి ఉంది. వంద మందికి హాస్టల్‌లో ఉండేందుకు ప్రభుత్వ అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం జారీ చేసే మెనూ ప్రకారం భోజన వసతి కల్పిస్తున్నాం. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి)

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ - ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, అధికారులు



రాయికల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సహకార అధికారి, దమ్మన్నపేట, తక్కళ్ళపల్లిలో ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్లు చిలుముల లావణ్య, నారాయణరెడ్డి

రాయికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ సూచించారు. రాయికల్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ ఆఫీసర్ సత్యనారాయణ, అడాప్షన్ ఆఫీసర్ సాయికుమార్, సంఘం అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు బేతి మోహన్‌రెడ్డి, సంఘం డైరెక్టర్లు కుర్మ రాము, కొల్ల నారాయణ, బోడ భూమరాజు, ఇన్‌చార్జి సీఈవో కటుకం జగదీశ్, సెంటర్ ఇన్‌చార్జి శంకర్, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ఆలూరులో ఉప్పుమడుగు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ దీటి రాజిరెడ్డి, వైస్ చైర్మన్ దుంపల స్వామిరెడ్డి ప్రారంభించారు.

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర పొందవచ్చునని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, అనంతారం ఐకేపీ కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీవో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, నాయబ్‌తహసీల్దార్ కార్తీకరెడ్డి, సివిల్ సప్లైఅధికారులు వరప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఏపీఎం గంగాధర్, పాల్గొన్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట, ధరూర్, అంబారిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని తహసీల్దార్ రాంమోహన్, ఎంపీడీవో విజయలక్ష్మి ప్రారంభించారు. ఎంపీవో వాసవి, ప్యాక్స్ వైస్‌చైర్మన్ శీలం సురేందర్, వీవోఏ వసంత, రైతులు పాల్గొన్నారు.

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మన్నపేట, పెద్దనక్కలపేట, రాజారం గ్రామాల్లో జైనా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్, సీఈవో బలుమూరి సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్ళపల్లి, బొమ్మెన, తాండ్ర్యాల, అంబారిపేట, పోతారం, గంభీర్‌పూర్ గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పులి శిరీషహరిప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, అల్లకొండ లింగంగౌడ్, ఎగ్యారపు శ్రీహరి, ఏఎంసీ డైరెక్టర్లు, భూపెల్లి రాజగంగారాం, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఏపీఎం నరహరి, వీఓఏలు ఉన్నారు.

వెల్గటూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనూర్, శాఖాపూర్, ముత్తునూర్, ముక్కట్రావ్‌పేట, చెగ్యాం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రత్నాకర్, రాంరెడ్డి, ఏపీఎం చంద్రకళ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు మెరుగుగ మురళి, మంజుల, వెంకటేష్ పాల్గొన్నారు.

గొల్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్రావుపేటలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గొల్లపెల్లి మార్కెట్ చైర్మన్ భీమ సంతోష్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు సరసాని రాజ్యలక్ష్మి, తిరుపతి, గోలి లక్ష్మి, గంగారెడ్డి, మహేష్, జక్కు వెంకటేష్, గోలి రమేష్, గాజుల తిరుపతి, బుర్ర రాజయ్య, గాజుల మౌనిక, సుద్దాల శేఖర్ పాల్గొనారు.

బీర్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోతినగర్‌లో బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ముంతాజుబ్దిర్ ప్రారంభించారు. సహకార సంఘం అధ్యక్షుడు ముప్పాల రాంచందర్‌రావు, మండల వ్యవసాయ అధికారి ప్రదీప్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాహుల్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం @ 47,787

(5వ పేజీ తరువాయి)

జిల్లా కమిటీకి సమర్పించనున్నారు. జిల్లా కమిటీలోని సభ్యులు జాబితాను పరిశీలించి అర్హులకు రుణాలు మంజూరు చేయనున్నారు.

● బీసీ కార్పొరేషన్‌లో నిర్ణయం కానీ యూనిట్ల లక్ష్యం..

బీసీ సంక్షేమ, కార్పొరేషన్ శాఖలో యూనిట్ల లక్ష్యం ఇంకా నిర్ణయం కాలేదు. జిల్లావ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ కింద యూనిట్లను పొందడానికి 31,128 దరఖాస్తులు వచ్చాయి. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద 6,749 దరఖాస్తులు, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద 444, వాషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ కింద 903, వడ్డెర కార్పొరేషన్ కింద 592, ట్యాడీ టాపర్స్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద 2,669, సాగర కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ కింద రెండు, వాల్మీకి, బోయ కార్పొరేషన్, కో ఆపరేటివ్ సొసైటీస్ 201, క్రిష్ణ బలిజ, పూసల సొసైటీ కింద 270 దరఖాస్తులు వచ్చాయి. విశ్వ బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ 3,149, కుమ్మరి సొసైటీస్ కింద 826, మేదరి ఫైనాన్స్ కార్పొరేషన్ కింద 483, ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ కింద 1,664, గంగపుత్ర కో ఆపరేటివ్ సొసైటీ కింద 1,227, మున్నూరు కాపు కార్పొరేషన్ కింద 2,885, లింగాయత్ కో ఆపరేటివ్ సొసైటీ కింద 20, యాదవ కో ఆపరేటివ్ సొసైటీ కింద 1,773, మేర కో ఆపరేటివ్ సొసైటీ కింద 413, పద్మశాలీ కార్పొరేషన్, కో ఆపరేటివ్ సొసైటీ కింద 3,911, పెరిక కో ఆపరేటివ్ సొసైటీ కింద 461, ఈబీసీ వేల్ఫేర్ బోర్డు కింద యూనిట్లు పొందడానికి 1,074 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోవాలి

- బీఎస్ లత, అదనపు కలెక్టర్



ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే యూనిట్లకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించాము. వేరిఫికేషన్ ప్రక్రియ కూడా వేగంగా పూర్తి చేస్తాము. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాలకు సంబంధించి యూనిట్లు ప్రభుత్వం నుంచి మంజూరవుతాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెప్యూటెటెడ్ జూనియర్ కళాశాలల స్కీం కింద విద్యార్థినీ, విద్యార్థులకు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌లు కల్పించేందుకు గాను ఆన్‌లైన్‌లో కళాశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల జిల్లా సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెప్యూటెటెడ్ జూనియర్ కళాశాలలను నూతనంగా ఎంపికచేసేందుకు రెసిడెన్షియల్ వసతి కలిగిన విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు కలిగి, కాంపిటీటివ్ పరీక్షల్లో ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత కలిగిన కళాశాలల నుంచి ఐదేళ్లకు సంబంధించి తమ కళాశాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని మే 1 తేది సాయంత్రం 5గంటల లోపు ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం కలెక్టరేట్ నందు సమర్పించాలన్నారు. దరఖాస్తుకు సంబంధించి కళాశాల యొక్క బీఐఈ అనుబంధ ధ్రువీకరణ పత్రాలు, కళాశాల భవనం, హాస్టల్ వసతి వివరాలు, కళాశాల క్లాస్‌రూం, డార్మిటరీ, హాస్టల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వివరాలు, కళాశాల అకడమిక్ రికార్డు, ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణతా శాతం వివరాలు, ఐఐటీ, జేఈఈ, ఏఐఈఈఈ వంటి పరీక్షల్లో సాధించిన ఫలితాల వివరాలతో పాటు ఫ్యాకల్టీ, వారి సీనియారిటీ వివరాలు కళాశాల యొక్క ల్యాబ్, లైబ్రరీ వివరాలు సమర్పించాలన్నారు. ఎంపిక కాబడిన కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద ప్రతి విద్యార్థికీ రూ.35వేలు పాకెట్ మనీ కింద రూ. మూడు వేల రూపాయలు ప్రతి సంవత్సరం మంజూరు చేస్తామని తెలిపారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

గొల్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు కట్ట మహేష్, పార్టీ కార్యకర్తలు కళ్యాణ్ వెంకటేష్ ఇళ్లపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల రామకృష్ణ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రామకృష్ణ రెడ్డి నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను వెంటనే రిమండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కన్నం అంజయ్య, తాడ్వాయ్ రాంగోపాల్‌రెడ్డి, మెడవేణి సతీష్‌రెడ్డి, సింహాచలం సత్యం, పల్లె మోహన్, గుంత సంతోష్, పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్ట్ అక్రమం

కొడిమ్యాల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల అరెస్ట్ అక్రమమని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు అన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని గురువారం హైదరాబాదు గాంధీ భవన్ వద్ద 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులు శాంతియుత ధర్నా చేస్తుంటే అరెస్టు చేయడం అక్రమమని ఫోన్ ద్వారా ఆవేదన చెందారు. గత ప్రభుత్వం చేసిన తప్పును ఈ ప్రభుత్వం చేయటం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. నిరసన కార్యక్రమంలో నాచుపల్లి జేఎన్‌టీయు కళాశాలకు చెందిన కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి - పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ, పక్కన పసుపబోర్డు చైర్మన్ గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఏవైనా జిల్లాలో బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా సమష్టి కృషితో పనిచేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ధరూర్ క్యాంప్‌లో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచకొండ యాదగిరి బాబు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ అంటేనే కార్యకర్తల పార్టీ అన్నారు. దేశంకోసం, ధర్మకోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని గుర్తుచేసిన ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

అనంతరం జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ చిట్టచివరి వ్యక్తి వరకు పార్టీని తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. తాజీ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ పార్టీ బలోపేతం కోసం తీవ్రంగా కృషిచేశారని, నూతన జిల్లా అధ్యక్షుడు యాదగిరి కార్యకర్తల కష్టసుఖాల్లో భాగం పంచుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల విజయానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా తాజామాజీ అధ్యక్షుడు సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, ధర్మపురి, కోరుట్ల నాయకులు కన్నం అంజయ్య, డాక్టర్ రఘు, పట్టణ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు గంగాధర్, రాజన్న, ఆముద రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు నలువాల తిరుపతి, జుంబర్తి దివాకర్, సాంబారి కళావతి, గడ్డల లక్ష్మీ హరికృష్ణ, మమత, కవిత, పుష్పారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న గోవర్ధన్

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీపీసీసీ డెలిగేట్ సుజిత్‌రావు నివాసంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ పంపిణీ చేశారు. 2.19 లక్షల విలువ గల చెక్కలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలక వరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ఎండీ ఖుతుబ్ పాషా, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మారుతి, నాయకులు మొగిలి, రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మల్లాపూర్, ఏప్రిల్, 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన గొర్రె రాజం అనే వ్యక్తికి ఇండియన్ బ్యాంకు అధికారులు ప్రమాద బీమా చెక్కును గురువారం అందజేశారు. రాజం మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బ్యాంకు అధికారులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద మంజూరైన రూ. 2లక్షల విలువ గల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, లీడ్ బ్యాంకుతో పాటు, ఇండియన్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న కంకులు దగ్ధం

రాయికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వస్తాపూర్ గ్రామానికి చెందిన గడ్డం దీపక్‌రెడ్డి అనే రైతుకు చెందిన మొక్కజొన్న కంకులకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం



రాయికల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న జీవన్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ధాంరాజుపల్లిలో మాట్లాడుతున్న కృష్ణారావు

రాయికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యమని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్‌లో గురువారం జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలోని అంబేద్కర్ విగ్రహంతో పాటు సుభాష్ చంద్రబోస్, చాకలి ఐలమ్మ విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని రక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. బీజేపీ చాపకింద నీరులా రాజ్యాంగాన్ని నీరుగార్చుతుంద న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, నాయకులు గోపి రాజరెడ్డి, గోపి మాధవి, గంగారెడ్డి, తాటిపర్తి విజయలక్ష్మి, దేవేందర్ రెడ్డి, ధర రమేష్‌బాబు, మసర్తి రమేష్, తలారి రాజేష్, వెంకట్‌రెడ్డి, మ్యాకల రమేష్, కొయ్యడ మహిపాల్, దూలూరి సాయి, తంగెళ్ల రమేష్, పాల్గొన్నారు.

మల్లాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగేమ్‌శ్రీరాంపూర్, కొత్తధాంరాజుపల్లి, పాతధాంరాజుపల్లి, వాల్గొండ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నల్ల రాజన్న, జమాల్, గజ్జి గంగారెడ్డి, హన్మంతు, నల్ల బాపురెడ్డి, సిరిపురం రవీందర్, నర్సయ్య పాల్గొన్నారు.

కోరుట్ల, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2, 3, 4, 16 వ వార్డుల్లో జై బాపు.. జైభీమ్... జై సంవిధాన్ యాత్రను కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు కాశిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పోనకంటి చిన్న వెంకట్ పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా చిన్న లింబాద్రి గౌడ్



నియామకపత్రాన్ని అందజేస్తున్న దాసు సురేష్

రాయికల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక, సామాజిక సేవకులు అనుపురం లింబాద్రి గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ నియామకపత్రం అందజేశారు. రాష్ట్రంలో బీసీ సామాజిక విప్లవం మొదలైందని, రాబోవు స్థానికసంస్థల ఎన్నికల్లో పెద్దఎత్తున బీసీ నాయకుల గెలుపే దిశగా భవిష్యత్ కార్యాచరణను కొనసాగిస్తామని తెలిపారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి

- జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి

ధర్మపురి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలను పెంచాలని జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలాజిస్ట్, మత్తువైద్య నిపుణులు, డాక్టర్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుగ్గారం, వెల్గటూర్ మండలాల పరిసర ప్రాంతాల నుంచి గర్భిణులను అధికంగా సాధారణ కాన్పులకు తరలించాలని అన్నారు. ఆశా వర్కర్స్, ఏఎన్‌ఎంలకు లక్ష్యాన్ని ఆయన విధించారు. గర్భిణిగా నమోదు చేసినప్పటి నుంచే వారిని మోటివేట్ చేయాలని ఆయన సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటూ యోగా లాంటి ఎక్సర్‌సైజులు చేస్తే సాధారణ కాన్పులు సులభమేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, డీసీహెచ్ డాక్టర్ రామకృష్ణ, హెచ్‌ఈవో రాజేశం, సూపర్‌వైజర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ పురోహితుడు ఉమాశంకర్ మృతి

ధర్మపురి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితుడు సంగనభట్ల ఉమాశంకర్ (69) ముంబాయిలో గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహం గురువారం ధర్మపురి చేరుకోగా గోదావరి నదీ తీరాన అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు ఉమాశంకర్ ప్రముఖ సినీ దర్శకుడు హరీష్ శంకర్‌కు స్వయాన చిన్నాన్న కావడంతో ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

జోగినిపల్లిలో బడి బాట



మొగిలిపేటలో బడిబాట నిర్వహిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగినిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు గురువారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులపై వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మల్లాపూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట, సాతారం గ్రామాల్లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిపిన కార్యక్రమంలో సర్కారు చదువు ఆవశ్యకత, పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు అందుతున్న పథకాలను ఉపాధ్యాయ బృందం వివరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య, అంగన్‌వాడీ బృందం, గ్రామాభివృద్ధి కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం

ధర్మపురి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దామెర రాంసుధాకర్‌రావు అన్నారు. ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ దుబాయ్‌లో పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తి దారుణంగా నరికి చంపాడు. దమ్మన్నపేట గ్రామంలో మృతుడి భార్య స్వర్గం జమున, కొడుకులు స్వర్గం చందు, సూర్యతో పాటు తల్లి స్వర్గం రాజవ్వను గురువారం ఆయన పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తల్లి రాజవ్వకు వ్యక్తిగతంగా రాంసుధాకర్‌రావు 10 వేల రూపాయల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, కందాల నర్సింహమూర్తి, పట్టణ మాజీ అధ్యక్షుడు బెజ్జారపు లవణ్, మండల మాజీ అధ్యక్షుడు సంగెపు గంగారాం పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

కొడిమ్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గురువారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు రక్తహీనత లోపం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్ సుధారాణి, సీహెచ్‌వో శిరీష, ఏఎన్‌ఎం సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, స్నేహలత, వసంత, పుష్పలత, పద్మ, ఆశాకార్యకర్తలు గర్భిణిలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్యాల సీడీపీవో వీరలక్ష్మి, సూపర్‌వైజర్ మామిడాల జ్యోతి, సామల రాజేశం, సరోజ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరావుపేట గ్రామంలోని అంగన్‌వాడీ పౌష్టికాహారం, చిరుధాన్యాలు తీసుకోవడం వలన కలిగే లాభాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్‌సుల్తానా వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

'మానేరు' విద్యార్థి ప్రతిభ

కొడిమ్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామంలో గల మానేరు ఉన్నత పాఠశాలలో 6వ తరతగతి చదువుతున్న సర్విన్ బోర్డు వాయిద్యంలో అద్వితీయ ప్రతిభను కనపరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. 2024 డిసెంబరు 1న ఆన్‌లైన్ వేదికగా జరిగిన పోటీ పరీక్షలో 45 సెకన్లలో కీ బోర్డు వాయించి రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా సర్విన్‌కు ఈ నెల 14న హైదరాబాదులో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు సర్టిఫికెట్‌ను అందించారు. గురువారం సర్విన్‌ను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చిన్న వయస్సులో గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న సర్విన్ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ అనంతరెడ్డి